

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

చిత్తూరు తిరుపతి

సోమవారం 9 జూన్ 2025









## నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

వివరాలు 4లో

## బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ వద్దు

డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

వివరాలు 4లో






## రెండవ రోజు తెప్పపై విహరించిన సుందర రాజు స్వామి

వివరాలు 5లో



# కుప్పంలో కల్తీ విశ్వరూపం..!

- ఆహార పదార్థాల కల్తీ రోజురోజుకూ పెచ్చుమీరుతోంది
- నాణ్యత లేని, కల్తీ వస్తువులతో ఆహార పదార్థాల తయారీ
- అక్రమార్కులు ఉప్పు, పప్పులు, బియ్యం, గోధుమలు, నూనెలు ఇలా అన్నీ కల్తీ చేస్తున్నారు.
- వాడిన నూనెలతోనే ఫాస్ట్‌ఫుడ్.. హెూటళ్లలోనూ ఆయిల్ పునర్వినియోగం
- ఆహార ప్రమాణాల పరిరక్షణ శాఖలో వేధిస్తున్న ఉద్యోగుల కొరత
- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న అక్రమార్కులు

“ఇందు గలదు.. అందు లేదన్న సందేహం వలదు.. అన్న చందంగా నేడు చాలా ఆహార పదార్థాల్లో కల్తీ, నకిలీలతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. బ్రాండెడ్‌లను పోలిన విధంగా నకిలీలను తయారు చేస్తున్నారు. కల్తీ వస్తువులతో చేసిన ఆహార పదార్థాలు, తినుబండారాలను అంటగడుతూ ప్రజల ప్రాణాలతో చెలగా టమాడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా అక్రమార్కులు కల్తీ వస్తువులను మార్కెట్లో నింపేస్తున్నారు. ఆహార కల్తీని, నకిలీల తయారీని అరికట్టాల్సిన ఆహార ప్రమాణాల పరిరక్షణ శాఖలో సిబ్బంది కొరత కూడా కల్తీ కేటుగాళ్లకు కలిసి వస్తోంది.”

**కుప్పం, మేజర్‌న్యూస్:**

కుప్పం నియోజకవర్గంలో, కుప్పం పట్టణంలో ఆహార పదార్థాల కల్తీ రోజురోజుకూ పెచ్చుమీరుతోంది. అక్రమార్కులు ఉప్పు, పప్పులు, బియ్యం, గోధుమలు, నూనెలు ఇలా అన్నీ కల్తీ చేస్తున్నారానే ఆరోపణలు సైతం ప్రజల నుండి వస్తున్నాయి. ఆహార పరిరక్షణ శాఖ సిబ్బంది కొరతతో కల్తీ సరుకులకు అడ్డుకట్టే లేకుండా పోతోంది.ప్రధానంగా వంట నూనెలు, పాలు, పెరుగు, నెయ్యి, అల్లం వెల్లుల్లి పేస్టు, మసాలాలు, టీ పౌడర్, ఐస్ క్రీమ్‌లను కల్తీ చేసి అమ్ముతున్నారు. హెూటళ్లు, స్ట్రీట్‌ఫుడ్ తయారీకి ఉపయోగించే నూనెలు, పిండి, మసాలాలు తదితర వస్తువులు చాలా మట్టుకు కల్తీవే.తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందేందుకు చిరు వ్యాపారులు కల్తీ సరుకులను విరివిగా వాడుతుంటారు. స్థానికంగా ప్యాక్ చేసి అమ్మే కొన్ని వస్తువులు, పదార్థాలు ఎక్కడ, ఎవరు, ఎప్పుడు తయారు చేస్తున్నారో కూడా తెలియడం లేదు. కానీ మార్కెట్‌లో మాత్రం యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. వినియోగదారులెవరైనా ఫిర్యాదు చేస్తే తనిఖీ చేసి నమూనాలను టెస్ట్ కోసం ల్యాబ్‌కు పంపి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆ తర్వాత ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఈ మధ్యకాలంలో ప్రజలు బయట హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్

మిగతా 8లో

# శ్యామ్ స్కామ్... కోట్లకు కోట్లు

## కాసుల పంట పండిస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్






- పక్కదారి పడుతున్న ప్రభుత్వ ఉచిత కోచింగ్
- అభ్యర్థులకు కమీషన్లు ఇచ్చి చేర్చుకున్న వైనం
- అధికారులకు విజయవాడ లాడ్జిలో మందు.. విందు..!!?
- మంగళం శ్రీను తరహా పార్టీతో అధికారులు సరెండర్..
- అన్ని కార్పొరేషన్లు చకచకా బిల్లులు చేసేలా ఏర్పాట్లు..
- ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, చీఫ్ సెక్రటరీకే పంగనామాల..!!
- దొంగ లెక్కల బాగోతం గుట్టు రట్టు చేయాలని అభ్యర్థుల డిమాండ్

**తిరుపతి, మేజర్‌న్యూస్:**

శ్యామ్ స్కామ్.. కోట్లకు కోట్లు. డీఎస్సీ అభ్యర్థుల ఆశలతో కాసుల కొట్టం (పాక) కట్టుకున్న శ్యామ్ ఎడ్యుకేషనల్ క్రైమ్‌ని ఓసారి నిశితంగా పరిశీలిస్తే.. నివ్వరపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గత ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవడంతో 16వేలకు పైగా ఉపాధ్యాయపోస్టులు భర్తీ కానున్నాయి. ఇదే నేపథ్యంలో ప్రభుత్వం బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ఈడబ్ల్యుసి, కాపు కార్పొరేషన్ల ద్వారా 25వేల నుంచి 28వేల వరకు ఒక్కో అభ్యర్థికి కేటాయిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని పలు ప్రైవేట్ కోచింగ్

మిగతా 2లో

## సూర్యప్రభ వాహనంపై గోవిందరాజస్వామి కటాక్షం

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి గోవింద రాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన ఆదివారం ఉదయం 7గంటలకు గోవిందరాజస్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంంగళవాయిద్యాల నడుమ వాహనసేవ సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని

మిగతా 8లో



## కౌండిన్య నదిని కబ్జా చేసి కార్ పార్కింగ్

- అన్యాక్రాంతమవుతున్న కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి
- పట్టించుకోని రెవెన్యూ మునిసిపల్ సిబ్బంది

**పుంగనూరు,మేజర్‌న్యూస్:**

పట్టణంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్న రెవెన్యూసిబ్బంది మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. గతంలో పుంగనూరులో రెండుసార్లు భారీవర్షాల కారణంగా వరదనీరు పొంగిఇళ్ళలోకి చేరి అవస్థలకు గురయ్యారు. గత ప్రభుత్వ హయాంలో వైసిపి నేతల అక్రమాలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంలో

మిగతా 2లో



## వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని పాలిచర్లవారిపాలెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బిబీజాన్ అనే మహిళ వైద్య ఖర్చులకోసం 25వేల రూపాయలను రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసరావునాయుడు దాతృత్వంతో ట్రస్ట్‌కార్యదర్శి రామయ్యనాయుడు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. రామయ్యనాయుడు



మాట్లాడుతూ పాలిచర్లవాలిపాలెం గ్రామానికి చెందిన బీబీజాన్ అనే మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆపరేషన్ చేయించుకోగా కుట్లు వద్ద గాయం మానకపోవడంతో మరల హాస్పిటల్‌కి వెళ్లి వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతుండ డంతో ట్రస్టు ద్వారా 25వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌సభ్యులు రాజనేని వెంకటేశ్వర్లునాయుడు, బాబు పాల్గొన్నారు.

## బంగారు ఋణాలపై కెనరా బ్యాంక్ ప్రచారం

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** అతి తక్కువ వడ్డీ రేట్లు,ప్రాసెసింగ్ చార్జీలతో కెనరాబ్యాంకు




చిట్టమూరు శాఖ బంగారంపై ఋణాలు అందజేస్తుందని మేనేజర్ రవిరాజా తెలిపారు. గత రెండు రోజులుగా మండలంలోని పలు గ్రామాలలో ఆటో ద్వారా బ్యాంకు అప్రైజర్ మనోహర్ ప్రచారం నిర్వహించారు. చిట్టమూరు బ్రాంచ్‌లో బంగారంపై గరిష్టంగా 70లక్షల వరకు ఋణాలు ఇవ్వనున్నట్లు తెలిపిన వారు గ్రాముకు వ్యవసాయానికి రూ.6500లు, ఇతర అవసరాలకు రు.5680 ఇస్తున్నామన్నారు. 9శాతంతో 75 పైసలుకే అతి తక్కువ వడ్డీతో ఋణాలను ఇస్తున్నట్లు ప్రచారం నిర్వహించారు. అతి తక్కువ ప్రాసెసింగ్ చార్జీలతో పది నిమిషాల్లో అన్ని రకాల గోల్డ్ ఋణాలను ఇచ్చేందుకు కెనరా బ్యాంక్ చిట్టమూరు శాఖ అన్ని పనిదినాల్లో పని చేస్తుందని ఈ అవకాశాన్ని బ్యాంకుపరిధిలోని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రెండు రోజులుగా మూసి ఉన్న రేషన్ డీలర్ షాప్

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని కుమ్మరి నత్తంపంచాయతీ బాల గురవయ్య గారి పల్లి హెచ్‌డబ్ల్యులో ఉన్న డీలర్ షాప్‌లో రెండు రోజుల నుండి నిత్యవసర సరుకులు ఇవ్వలేదని లబ్ధిదారులు ఆదివారం విలేకరులతో వాపోయారు వారు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం సాయంత్రం రెండు పూటలా వెళు



తున్నామని అయినా డీలర్ షాపులు తెరవలేదని ఇలాంటి రేషన్ షాపుల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

## బీసీసెల్ అధ్యక్షుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు



**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** చిల్లకూరు తెలుగుదేశం పార్టీ బిసి సెల్ మండల అధ్యక్షుడు మేకల కుమార్‌యాదవ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం మేకల కుమార్ స్వగృహంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, తొణుకుమాల ఉప సర్పంచ్ భాస్కర్, నాయకులు ముని శేఖర్‌గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీటీడీ ఇంజినీరింగ్ విభాగం అధికారుల బృందంచే ఆలయాలు పరిశీలన

**కుప్పం, మేజర్‌న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ వైద్యం శాంతారం, ధర్మప్రచార పరిషత్, సివిల్ ఇంజనీర్స్, తపతులు అధికారులు బృందంతో కుప్పం మండలంలో రెండు రోజులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో గ్రామదేవతల ఆలయాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో టీడీపీకి ప్రపోజల్ పెట్టడం జరిగిందని, కుప్పం



నియోజకవర్గంలో ఉన్న 141 ఆలయాలను రూ.33 కోట్లతో అభివృద్ధి చేసేందుకు గాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలకు పంపించడం జరిగిందని తెలిపారు. దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రజలు, భక్తుల మనోభావాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

## వివాహేతర సంబంధం వ్యవహారంలో ఇరువర్గాల ఘర్షణ

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** రామసముద్రంమండలంలో ఓవివాహితతో వివాహేతర సంబంధ వ్యవహారం ఇరువర్గాల్లో గొడవకు దారితీసింది. వివాదం రామసముద్రం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లగా పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. కానీ శనివారంరాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుబ్రహ్మణ్యం, సంతోష్, శివమ్మ భవాని, రామలక్ష్మమ్మ, వెంకటరమణ, వెంకటప్పలు గాయపడ్డారు. వారిని పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో కోలార్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## నేడు జిల్లా స్థాయిలో షైనింగ్ స్టార్ట్ అవార్డుల ప్రధానం

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:**



విద్యార్థుల్లో ప్రతిభ పాఠవాలు పెంపొందించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు తలపెట్టిన షైనింగ్ స్టార్ట్ అవార్డుల కార్యక్రమం జూన్ 9వ తేదీన సోమవారం ఉదయం 10 గం.లకు నాగయ్య కళాక్షేత్రంలో నందు నిర్వహించబడునని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఇన్చార్జి మినిస్టర్, ఎమ్మెల్యేలు పాల్గొంటారని, జిల్లాలోని 31 మండలాల నుండి పదవ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన 190 మంది విద్యార్థులకు ఇంటర్మీడియట్ నందు 33 మంది విద్యార్థులకు అవార్డులు అందజేయబడునని, ఒక్కొక విద్యార్థికి ప్రశంసా పత్రం, రూ.20వేలు నగదు బహుమతి మెడల్ అందజేయబడినని, ఎంపికైన విద్యార్థులు ఐడి కార్డు లేదా ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని రావాలని, ప్రతి విద్యార్థితో పాటు తల్లిదండ్రులలో ఒకరు ఆధార్‌కార్డుతో అనుమతించబడతారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



## యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

### ఎమ్మెల్యే పాశిం

**గూడూరు, మేజర్‌న్యూస్:** యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఎంఎల్ఏ డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగతో అందం, ఆరోగ్యం మీ సొంతమన్నారు. యోగా నిత్యం ఆచరించే వారికి మానసిక దృఢత్వం కూడ వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆందరి ఆరోగ్యం కోసం యోగాను ప్రతి ఒక్కరి జీవితంలో భాగం చేయాలన్న సంకల్పంతో పాఠశాల స్థాయి నుంచే అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, శ్రావణి, పట్టణ పరిధిలోని వివిద పాఠశాలలు, కళాశాలలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పురపాలక సంఘం కమిషనర్ వెంకటే శ్వర్లు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** మండలంలోని ఓబులాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల పరిధి గ్రామాలు ఎర్రమరెడ్డిపల్లి రెడ్డిపల్లి, ఓబులాయిపల్లి గిరిజన కాలనీలో ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నారని ప్రభుత్వ పాఠశాలలో లభించే సౌకర్యాలు ఉచితంగా యూనిఫామ్స్ టెక్స్టబక్స్, నోట్ బుక్స్. మధ్యాహ్న భోజనం పథకం తల్లికి వందనం పౌస్తికాహారం కొరకు రాగి జావా చిట్టీలు అందిస్తున్నారని తెలుపుతూ కరపత్రాలు పంచుతూ గ్రామంలో ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. వారు మాట్లాడుతూ వేసవి సెలవులు అనంతరం జూన్ 12వతేదీ పాఠశాల పున ప్రారంభిస్తున్నందున ముందుగానే విద్యార్థులను బడిలో చేర్చాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపి, ఉపాధ్యాయులు మోహన్‌బాబు, లోకనాథంరెడ్డి. శ్రీని వాసులు ప్రగతి స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త చంద్రశేఖర్. సిఆర్‌పి ధనశేఖర్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. 16మంది ప్రైవేటు పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు ప్రవేశాలు కల్పించారు.



## కొత్తగుంటలో న్యూరో ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని కొత్తగుంటలోని శాన్విక క్లినిక్ డాక్టర్ మౌనిక ఐఆర్‌ఎంపిడబ్ల్యూఏ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.నెల్లూరుకు చెందిన యామిని కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో న్యూరాలజీ ప్రముఖ వైద్యులు, స్విమ్స్ న్యూరాలజీ మాజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యామిని రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా కొత్తగుంటలోని శాన్వికహాస్పిటల్ ప్రజాసేవకు తమ వంతు కర్తవ్యంగా ఉచిత వైద్య శిబిరాలు, నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండడం అభినందనీయమన్నారు. నరాలు, కండరాల బలహీనత, తలనొప్పి, దీర్ఘకాలిక నొప్పులు, పలు సాధారణ జబ్బులను పరిశీలించి, పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో 100 మందికి పైగా రోగులను పరిశీలించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో యామిని కేర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.





## నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను ఉ.9.30 గం.ల నుండి మ.1 గం.వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరం నందు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉ.9 గంటలకు తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీనితో పాటు నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండలస్థాయి అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు.


**ప్రకటన**

**బయ్యా ఉమావతి భర్త బయ్యా కన్నారావు** అను నేను నాయెక్క డాక్యుమెంట్స్ పోయినవి. ఇందు మూలముగా తెలియజేయడమేమనగా.. డాక్యుమెంట్ నెం.2402/2016, నా పేరు మీద ఉన్న డాక్యుమెంట్ దానికి సంబంధించిన సర్వే నెం.75-1, గ్రామనత్తం ఈరోజు దినం తిరుపతి ఐకేఎఫ్ హెూమ్ ఫైనాల్స్ కంపనీ నందు లోను తీసుకుంటున్నాము. మరియు ఈ ప్రాపర్టీకి సంబంధించిన లింకు డాక్యుమెంట్‌లు మా దగ్గర కనిపించలేదు. కావున వాటి యొక్క నెంబరులు 209/2003, 1022/2003, 20.04.1977, సేల్ అగ్రిమెంట్ డీల్, ఇంటికి సున్నం కొడుతున్నప్పుడు నుండి డాక్యుమెంట్‌లు కనుబడటలేదు. కావున ఎవరికైనా తెలిసినచో తమకు అందివ్వాలని కోరుతున్నాము.

**బయ్యా ఉమావతి భర్త బయ్యా కన్నారావు**
డోర్ నెం.25/1, అగ్రహారపేట, నాయుడుపేట, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-524126, సెల్ నెం : 8688994889.

# నలుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

## - 48 దుంగలు స్వాధీనం

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** అన్నమయ్య జిల్లా తంబల్లపల్లి అటవీప్రాంతంలో 48 ఎర్ర చందనం దుంగలతో పాటు ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, నలుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆదేశాలతో డీఎస్పీ జి. బాలిరెడ్డి మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధరరెడ్డి టీమ్ శనివారం అన్నమయ్య జిల్లా బురకాయల కోట అటవీ ప్రాంతం చేరుకుని, స్థానిక అటవీ అధికారులు జయ ప్రసాదరావు, మోహన్ రెడ్డి, షబీన్ తాజ్ ల సహకారంతో వేపూరి కోట ఫారెస్ట్ బీటు పరిధిలో డంపింగ్ పాయింట్ల తనిఖీ చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున వీరు అన్నగారి పల్లి సమీపంలోని వంకగట్టు వద్ద ఒక మోటారు సైకిల్ కనిపించింది. దానిని సమీపించడంతో అప్పటికే అక్కడ గుమికూడి ఉన్న కొందరు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. ఆప్రాంతంలో తనిఖీ చేయగా అక్కడ 48 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని అన్నమయ్య జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. వారితో పాటు ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిల్ ను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




# ముద్దన్న 79వ జయంతి సందర్భంగా ప్రజానాయకుల విగ్రహాల ఆవిష్కరణ

## - ముఖ్య అతిథిగా పాల్గొననున్న గౌరవ నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

నగరి, మేజర్‌న్యూస్: సోమవారం ప్రజానేత, మాజీ మంత్రివర్యులు "గాలి ముద్దుకృష్ణమనాయుడు" విగ్రహా విష్కరణ జరుగుతుంది. ఉదయం 10గంటలకు- విజయపురం మండల కేంద్రం(విగ్రహ ఆవిష్కరణ,అన్నదానం) ఉదయం 11 గంటలకు పుత్తూరు పట్టణం (పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డు అన్న క్యాంటీన్ వద్ద తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రినందమూరి తారకరామా రావు, స్వర్గీయ గాలి ముద్దు కృష్ణమ నాయుడు విగ్రహా విష్కరణ, అన్నదానం) ఉదయం 11:30 గంటలకు నగరి పట్టణం (విగ్రహ ఆవిష్కరణ, అన్నదానం) ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ముద్దన్న అభిమానులు, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన తెలుగుదేశం పార్టీ- జనసేనపార్టీ-బీజేపీ ఎన్డీయే కూటమి కుటుంబసభ్యులు, ప్రజలు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలియజేశారు.



### రాజధాని అమరావతిపై

# అవాస్తవ వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నాం

## - పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే నెలవల విజయ్ శ్రీ

**సూళ్లూరుపేట : మేజర్‌న్యూస్:** రాజధాని అమరావతి పై సాక్షి ఛానల్ లో ప్రచారం కాబడిన వార్తలపై తీవ్రంగా ఖండిస్తున్నామని సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలియజేశారు. ఆదివారం సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్ లో సాక్షి ఛానల్ పై ఎస్సై బ్రహ్మనాయుడుకు ఫిర్యాదు చేశారు. రిపోర్టర్ కామినేని శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి స్త్రీలను గూర్చి వ్యంగ్యంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదు అని, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి అంటే దేవతల రాజధాని అని ఎన్నోసార్లు చెప్పారని, అలాంటి అమరావతి రాజధాని అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమిస్తూ రాష్ట్ర ప్రజల భావితరాల కోసం ముందు చూపుతో అమరావతి అభివృద్ధి కొరకు శ్రమిస్తుంటే అలాంటి రాజధాని గురించి సాక్షి మీడియాలో వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలియజేశారు. ఇలాంటి చౌకబారు రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని లేదంటే వచ్చే ఎన్నికలలో ఆ 11 సీట్లు కూడా రావని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుదాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, రూరల్ అధ్యక్షులు కొక్కు శంకరయ్య, మాదవ నాయుడు, సతీష్, ధన పాల్, నాయుకులు. కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ వద్దు

## - డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన ఉపాధ్యాయులు

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను ఆన్లైన్ వెబ్ కౌన్సెలింగ్‌లో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో జరపాలని ఆదివారంచిత్తూరు డిఈఓ కార్యాలయాన్ని పిఆర్టిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరి ప్రసాద్ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి రమణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఇప్పటివరకు జరిగినటువంటి ప్రక్రియ మొత్తం ఆన్లైన్లో జరగ్గా, ఉపాధ్యాయుల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తామని హామీ ఇచ్చినప్పటికీ,గత రెండు రోజులుగా బదిలీలను ఆన్లైన్లో జరపడానికి అధికారులు సమాయత్తమవడాన్ని జీర్ణించుకోలేని ఉపాధ్యాయులు జిల్లా నలుమూలల నుండి వేల సంఖ్యలో తరలివచ్చి ఈరోజు చిత్తూరు డిఈఓ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసనను తెలియజేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు పదోన్నతులను నిర్వహించడానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చినప్పటికీ చట్టంలో ఉన్నట్లుగా కాకుండా మొత్తం బదిలీలు పదోన్నతులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, మొన్న జరిగిన స్కూల్ అసిస్టెంట్ బదిలీలలో ప్రిఫరెన్స్ క్యాటగిరి ఉపాధ్యాయులు పెద్ద మొత్తంలో నష్టపోయారని,వెబ్ కౌన్సిలింగ్లో బదిలీలు నిర్వహించడం వల్లే ఇలాంటి పరిస్థితి దాపురించిందని వారు పేర్కొన్నారు. కావున సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకైనా వెబ్ కౌన్సిలింగ్ రూపంలో కాకుండా, ప్రత్యక్ష కౌన్సిలింగ్ నిర్వహించి వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ అయ్యే అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు.జిల్లాలో గాని, రాష్ట్రంలో గాని వేల మంది ఉపాధ్యాయులు తప్పనిసరి బదిలీ కింద ఉన్నారని, అలాంటి ఉపాధ్యాయులు ఆన్లైన్లో బదిలీలు కోరుకునే క్రమంలో వేలకొద్దీ పోస్టులకు ఆప్షన్ ఇచ్చుకోవలసి ఉంటుందని, అలా ఇచ్చుకున్నప్పటికీ ఆన్లైన్ సిస్టంలో సాంకేతిక సమస్యల వలన అనేక తప్పులు జరిగి ఉపాధ్యాయులు నష్టపోతున్నారని నాయకులు ఆరోపించారు. ఆ రకంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు సంబంధించినటువంటి ఫిర్యాదులు చేసినప్పటికీ వాటిని పరిష్కరించకపోగా, కనీసం ఫిర్యాదులు కూడా తీసుకోవడం లేదని, దీన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని వారు తెలియజేశారు. ఇలాంటి ఇబ్బందులు లేకుండా బదిలీలు జరగాలంటే వెబ్ కౌన్సిలింగ్ రూపంలో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో బదిలీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా చిత్తూరు డి ఈ ఓ కార్యాలయం వద్ద వందలాది మంది ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి తమ నిరసనను చాటుకున్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు బాలాజీ, చెంగల్రాయమందడి, ముత్యాలరెడ్డి, ఎం సోమశేఖర్ నాయుడు, ఎన్ మణి గండన్, ఎన్ ఆర్ మదన్మోహన్ రెడ్డి, బి. మోహన్, కిరణ్ కుమార్, ముక్తర్ హమ్మద్, కె ఎస్ కన్నన్, విజయ్ భాస్కర్ రెడ్డి, నాగరాజా, జి సాంబిరెడ్డి, ఎస్ వెంకట ముని, జి. మునీర్ అహమ్మద్, పి సుధాకర్ రెడ్డి కే దీనావతి ఎస్పీ బాషా దేవరాజుల రెడ్డి, కార్యకర్తలు, వందలాది సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# రోడ్డుపై గుంత.. పొంచి ఉన్న ప్రమాదం...

## - గత రెండు వారాలుగా అవస్థలు పడుతున్న పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు

**పెనుమూరు, మేజర్‌న్యూస్:** నిత్యం ద్విచక్ర వాహనాలు పాదాచారులు తిరిగే రద్దీగా ఉండే ప్రాంతమైన రోడ్డుపై గుంత ప్రమాదకరంగా పొంచి ఉన్నప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రమైన పెనుమూరులో స్థానిక జాంధ్ర వీధి నుండి బైపాస్ ఇటు మెయిన్ రోడ్ కి వెళ్లే రహదారి వద్ద మురికి కాలువ నిండిపోవడంతో ఆ కాలువ పరిశుభ్రత పనులకై పంచాయతీ అధికారులు కాల్వ పైనున్న రాళ్లను తొలగించి పెద్ద గుంతను ఏర్పాటు చేశారు. రెండు వారాలుగా ఆ గొంతును పూడ్చక పోవడంతో తరచూ రద్దీగా ఉండి వాహనదారులు పాదాచారులు వెళ్లే మార్గంలో ఇలాంటి ప్రమాదకరమైన గుంత ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇక్కడ ఎలాంటి భద్రత ఏర్పాటు చేయకపోవడంతో ఇటువైపు వెళ్లే చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కడ ప్రమాదాన్ని గురవుతారని భయపడుతున్నారు. మురికి కాలువ పరిశుభ్రత పనుల కోసం గుంతను ఏర్పాటు చేసిన అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారు అంటూ స్థానిక ప్రజలు వాపోతున్నారు, ఇకనైనా మండలాధికారుల స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ గుంతను త్వరత గతిన పనులు చేపట్టి ప్రమాదాన్ని గురికాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.



## డయల్ యువర్ కమిషనర్ సమయంలో మార్పు

### - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్



**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రతి సోమవారం నగరపాలక సంస్థలో ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం పరిపాలన కారణాల వలన 10.30 నుండి 11.30 గంటల వరకు నిర్వహించ నున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక యధావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో నేడు ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందన్నారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## రెండవ రోజు తెప్పపై విహరించిన శ్రీసుందరరాజ స్వామి

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండవరోజు ఆదివారం పద్మసరో వరంలో శ్రీ సుందరరాజ స్వామి వారు తెప్పపై మూడు చుట్లు విహ రించి భక్తులను అనుగ్రహించారు.ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, నిర్వహించారు. మధ్యాహ్నం 03.00 నుండి 4.30 గంటల వరకు స్వామి వారికి వేడుకగా అభిషేకం నిర్వహించారు. ఇందులోభాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం శ్రీ సుందరరాజ స్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి ఇతర ఆధికారులు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





## అభివృద్ధికి ముందు ఉంటాం : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** అభివృద్ధికి తాను ముందు ఉంటామని తెదేపా అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక ఎల్‌జిబి ఫంక్షన్ హాల్‌లో చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెదేపా అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు విచ్చేశారు. ఈ సందర్భంగా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి అన్నదే మా ముఖ్యమంత్రి చంద్రబాబు అజెండా అని ఉమ్మడి చిత్తూరు జిల్లా విడిపోవడంతో తిరుపతికి అన్ని వెళ్లాయని చిత్తూరుకు తగు న్యాయం జరగలేదని, దానిని ప్రస్తుత ప్రభుత్వంలో సాధ్యమైనంత వరకు అభివృద్ధి వైపు అడుగులు వేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ వైఖరి వల్లే చిత్తూరుకి ఈ దుస్థితి వచ్చిందన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్ మోహన్ ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఇద్దరు అభివృద్ధి కే ముందు ప్రాధాన్యత ఇస్తున్నారని. ఎంపీ దగ్గుమళ్ళ చొరవతో కాట్పాడి తిరుపతి రైల్వే డబల్ లైన్ శాంక్షన్ అయింది అన్నారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి మాట్లాడుతూ నగర శివారులో అనేక రహదారులు వచ్చాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కలయికలో ఇంకా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అధ్యక్ష కార్యదర్శులు తాండవ మూర్తి గోపి నాయక్ లు మాట్లాడుతూ చిత్తూరు నగర అభివృద్ధి చెందే వరకు మా సొసైటీ తరఫున పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు మురళి, సత్య, కార్పొరేటర్ అశోక్, నాయకులు రషీద్, శ్రీనివాస బాబు, అశోక్ కుమార్, మల్లికార్జున రావు, రాజేంద్ర, శరత్, రమేష్ బాబు, చిన్న, స్టాక్ రమేష్, కుమరేషన్, చంద్రబాబు, శ్రీనివాసమూర్తి, ఈసా గణేష్, సందీప్, వరద, రాము, శోభారాణి, భూదేవి తదితరులు పాల్గొన్నారు.




## గంగమ్మ జాతరల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి మండలాలలో జరిగిన గంగమ్మ జాతర్లకు పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి ఆదివారం హాజరయ్యారు. బైరెడ్డిపల్లి మండలంలోని నెల్లిపట్ల,పెద్దపంజాణి మండలంలోని బసవరాజు కండ్రిగ గ్రామాల్లో గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరకు స్థానిక మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సంతోషంగా ఉండేలా ఆ అమ్మవారి చల్లని చూపు చూపాలని ఆయన వేడుకున్నారు. జాతర నిర్వాహకులు ఆయన్ను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాలలో బైరెడ్డిపల్లి మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, నాయకులు రమేష్, విల్వనాథం, జయన్న,గోవర్ధన్,లోకనాథ్ రెడ్డి, పెద్దపంజాణి మండల నాయకులు మురహరి రెడ్డి, చలపతి, భాను ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బలిజలను బీసీ జాబితాలో చేర్చాలి

### - సంఘం నాయకుల డిమాండ్

**చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్:** బలిజ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని బలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరం లోని స్థానిక నాగయ్య కళాక్షేత్రం లో గల శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకు మునుపు విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిత్తూరు బలిజ సంఘం అధ్యక్షులు ఓ యం రామదాసు మాట్లాడుతూ బలిజ, తెలగ, ఒంటరి, కాపు కులాన్ని బిసి జాబితాలో చేర్చాలని అన్నారు. అనంతరం ఒంగోలుకు చెందిన సాన ప్రసాద్ మాట్లాడుతూ తాను చిత్తూరు నుంచి అమరావతి వరకు కాలినడకన ప్రయాణం చేస్తూ తమ కులాన్ని ఓసి జాబితాలో నుంచి తొలగించి బిసి జాబితాలో చేర్చాలని దీక్ష చేపట్టడం చేపట్టడం జరిగిందన్నారు. గతంలో తమ కులానికి చెందినవారు ఎంతోమంది పోరాటాలు చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ నిరసన రాజకీయ పార్టీలకు అతీతంగా చేపట్టడం జరిగిందని ఇందులో రాజకీయ ప్రలోభం ఏమాత్రం లేదని కేవలం తమ కులానికి న్యాయం జరగాలని పోరాటం చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు వరదరాజులు, తులసి, రామ్మూర్తి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తే పినాక లక్ష్యం

**పలమనేరు, మేజర్‌న్యూస్:** గంగవరం మండలంలోని ఏ జె సి కళ్యాణ మండపంలో పినాక ప్రజా సాధికార ట్రస్ట్ ఆధ్వర్యంలో రూరల్ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తు తమ ముఖ్య లక్షమని ఐ.ఆర్.ఎస్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇన్కమ్ టాక్స్ హైదరాబాద్, పినాక ప్రజా సాధికార ట్రస్ట్ వ్యవస్థాపకులు బి. యాదగిరి ఐ ఆర్ ఎస్ వారి సహకారంతో సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా,పినాక ప్రజా సాధికార ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఐ ఆర్, ఎస్,అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఇన్కమ్ టాక్స్ హైదరాబాద్,బి యాదగిరి, బి గాయత్రీ మేనేజింగ్ ట్రస్ట్,ఆఫ్ పినాక పీపుల్స్ ఎంపవర్మెంట్ ట్రస్ట్ తిరుపతి, కే.జీ.కృష్ణమూర్తి ఫార్మర్ అడిషనల్ హైకోర్టు, ధర్మ తేజ మేనేజింగ్ డైరెక్టర్ బెంగళూర్, రెడ్డప్ప టీవీ 45 హైదరాబాద్, రమణ డైరెక్టర్ ప్రగతి ఎన్జీవో తిరుపతి, లైన్ రాజారామ్ కొల్లే సీఈఓ ట్రైనర్ పర్సనాలిటీ డెవలప్మెంట్, సుబ్రహ్మణ్యం గౌడు కౌన్సిలర్, సోమశేఖర్ గౌడ్ టిడిపి గంగవరం అధ్యక్షులు, జయప్ప రామకుప్పం ఎక్స్ జెడ్పిటిసి, రమణ డైరెక్టర్ ఆఫ్ అమెరికన్ ఎక్స్ప్రెస్ యూఎస్ఏ, లలితమ్మ పిఓఆర్డి ఆర్గనైజేషన్ వీరందరూ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ కెరియర్ కౌన్సిలింగ్, జీవన నైపుణ్యాల పర్సనాలిటీ డెవలప్మెంట్ కోర్స్ లు ఉచితంగా మే 18వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థినీ విద్యార్థులు డిగ్రీ పూర్తి అయిన వారు ఇంగ్లీష్ మాట్లాడడానికి ఈ పినాక ప్రజా సాధికార ట్రస్టు వారు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పినాక ప్రజా సాధికార ట్రస్ట్ 2012 సంవత్సరం నుండి ఇప్పటి వరకు మదనపల్లె, రాయచోటి, నగిరి, పలమనేరు ప్రాంతాలలో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు వారి భవిష్యత్తు కోసం వారి అభివృద్ధి కోసం తమ పినాక ప్రజా సాధికార ట్రస్ట్ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థులు అభివృద్ధి బాటలో పయనించడానికి వీరు నిరంతరం కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు బాగా చదువుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతి బి. స్వాతిరూ: 5.000,ఎస్. సబిహ రూ: 2.500 ఇవ్వడం జరిగిందన్నారు.విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు మధ్యాహ్న భోజనం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గజేంద్ర, జయ శ్రీ, ముద్దుకృష్ణ, చలపతి, రూప్ కుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా మూసిన ద్రౌపది కల్యాణోత్సవం



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలం లోని కొల్లగుంట పంచాయతీలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ద్రౌపది కళ్యాణోత్సవం వేద పండితులు మంత్రోచ్చారణ మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా కళ్యాణో త్సవం నిర్వహించారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం చుట్టూ విద్యుద్దీపన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇద్దరు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

**కార్వేటి నగరం మేజర్‌న్యూస్:** స్థానిక పభుత్వ ఉన్నత పాఠశాల చెందిన పదో తరగతి పరీక్షల్లో ఇద్దరు ప్రతిభా అవార్డులు వచ్చినట్లు ప్రధాన ఉపాధ్యాయులు కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2025 పదవతరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సంవత్సరం "షైనింగ్ స్టార్" పేరుతో ప్రతిభా పురస్కారాలు అందిస్తోంది. హేమంత్ 536, గీతిక 527 మార్కులు సాధించారు. వీరికి చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ చేతులమీదుగా రూ 20వేల నగదు బహుమతి, మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు అందుకోనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో ఒకరు పాల్గొంటారు. ఈ సందర్భంగా మండలంలోని అత్యధికంగా ముగ్గురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు గ్రామస్తులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.





# పల్లా సింహాచలం మృతి పార్టీకి తీరని లోటు



**సత్యవేడు మేజర్‌న్యూస్:** తెదేపా రాష్ట్ర అధ్యక్ష్యులు పల్లా శ్రీనివాసరావు యాదవ్ తండ్రి పల్లా సింహాచలం యాదవ్ ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అని,ఒక గొప్పనేతను కోల్పోయామని చెపుతూ, తెదేపా సత్యవేడు పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, కో ఆర్డినేటర్ శ్రీపతి బాబు లు అశ్రునయనాలతో శ్రద్ధంజలి ఘటించారు.పల్లాశ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.ప్రజా సేవలో వెనుకడగు వేయని అపర చాణిక్యుడివలె ప్రజల కోసం సింహాచలం యాదవ్ ఎనలేని విధంగా పని చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యకర్తలతో కలిసి నివాళులు అర్పించారు

# ఘనంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** చంద్రగిరి మండలం, మిట్టపాలెం గ్రామంలోని శ్రీనివాస హోటల్ నందు ఆదివారం తిరుపతి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ఈనెల 23న ఒలింపిక్ డే సందర్భంగా తలపెట్టిన ఒలింపిక్ రన్ జయప్రదం చేయాలని క్రీడా సంఘాల ప్రతినిధులను కోరారు. అనంతరం ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ త్వరలో క్రీడా సంఘాల ఆధ్వర్యంలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 40 సంవత్సరాల నుంచి క్రీడలకు సేవలు అందించిన ప్రసన్న కుమార్‌ను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సాయికుమార్, ఉపాధ్యక్షుడు శివప్రసాద్,సహకార దర్శి విజయకుమార్,రత్న కుమార్, టైక్వాండో సంఘం నుండి గోపి నాయుడు,బ్యాడ్మింటన్ సంఘం నుండి శివయ్య,రాకెట్ బాల్ సంఘం నుండి ప్రేమ్,రోయింగ్ సంఘం నుంచి శ్రీధర్,రైఫిల్ షూటింగ్ సంఘం నుండి హిమత్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి రాజధాని మహిళా రైతులను వైసిపి నాయకులు మాట్లాడిన తీరుపై ఖండన



పుంగనూరు మేజర్ న్యూస్: టిడిపి నాయకులు మధుసూదన్ రాయల్ తన నివాసంలో ఆదివారంవిలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత విధ్వంస పాలనకు విముక్తి పలికి సంవత్సరం రోజులు అయింది. రాజధానికి స్వచ్ఛందంగా రైతులు భూమి ఇచ్చారు. కొంతమంది వైసిపి నాయకులు అమరావతిని వేశ్య రాజధానిగా హేళన చేయడం చాలా బాధాకరమన్నారు. భారతదేశంలోని ఒక మహోన్నతమైన రాజధానిగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతి వేదికగా చెప్పాడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అండదండలతో రాజధాని ప్రాంతాన్ని మహోన్నతమైన రాజధానిగా చేస్తారు ఇప్పుడు రాజధాని కి భూములు ఇచ్చిన మహిళలను ఇలా కించపరచడం చాలా బాధాకరమన్నారు.

# మహిళలను అవమానిస్తే కాలగర్భంలో కలిసిపోతారు

**- మహిళలను అవమానపరిచిన జగన్ క్షమాపణలు చెప్పాలి**
**- కుప్పం నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు అనసూయమ్మ**



**కుప్పం, మేజర్‌న్యూస్:** మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని కుప్పం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, కడ మెంబర్ సుగుణమ్మ అన్నారు.కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో కుప్ప నియోజకవర్గం తెలుగు మహిళలు మాట్లాడుతూ మహిళలు, ఆడబిడ్డల జోలికి వస్తే జగన్ రెడ్డిని ఉపేక్షించే ప్రసక్తే లేదని కుప్పం తెలుగు మహిళలు స్పష్టంగా హెచ్చరించారన్నారు. జగన్ మీడియాలో అమరావతి ప్రాంత మహిళలను ఘోరంగా అవమానించడం దారుణమన్నారు. ఆ మీడియాలో ఓ జర్నలిస్టు మహిళలను కించపరిచేలా మాట్లాడిన తీరు సిగ్గుచేటన్నారు. అమరావతి మీద విద్వేషంతో జగన్ అండ్ కో చేస్తున్న అసత్య ప్రచారాలు దుర్మార్గమన్నారు. జగన్ పార్టీని ప్రజలు 11సీట్లకే పరిమితం చేసినా ఆ పార్టీ నాయకులు మార్పు రాలేదన్నారు. కన్న తల్లిని, సొంత చెల్లిని తరిమేసిన దుర్మార్గుడికి మహిళల త్యాగాలు, గొప్పతనం ఏం తెలుస్తుంది? అమరావతిపై విషం చిమ్మేందుకు జన్మనిచ్చిన అమ్మలను, జన్మంతా మనతో నడిచిన మహిళాలోకాన్ని కించపరిచిన జగన్ గ్యాంగ్‌ని ఎట్టి పరిస్థితుల్లో క్షమించం. జగన్‌రెడ్డి బేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు.జగన్ బ్యాచ్ చేస్తున్న ఇలాంటి దిగజారుడు చర్యలను ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అమరావతి మహిళలపై చేస్తున్న నీచపు ప్రచారాలపై మహిళా కమిషన్, ఎస్సీ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, కడ మెంబర్ సుగుణమ్మ, శారదమ్మ, పద్మ, పద్మమ్మ, స్వాతి, జ్యోతి, తిరుపతమ్మ, తిరుమగళ్, పుష్ప మరియు నియోజకవర్గ మహిళలు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనం ద్వారా మంచి దిగుబడులు

**పెనుమూరు, మేజర్‌న్యూస్:** వ్యవసాయ సాగులో ధృవీకరించబడిన నాణ్యమైన నూతన వంగడాలకు చెందిన విత్తనం వినియోగించటం ద్వారా వ్యవసాయ శాఖ మంచి దిగుబడులు పొంది అధిక లాభాలను సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు తెలిపారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి వారు భారత వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ , భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, న్యూ డిల్లీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "వికసిత్ కృషి సంకల్ప అభియాన్"లో భాగంగా ఆదివారం పెనుమూరు మండలంలోని గొబ్బిళ్ళమిట్ట, వడ్లవానిమిట్ట గాంధీపురం గ్రామాలలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతుల చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతును ఉద్దేశించి శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో పండించే పంటలలో నూతన రకాలు, చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు, సాగు ఖర్చు తగ్గించే భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యం, డ్రమ్ సీడర్ ద్వారా నేరుగా వరి విత్తే విధానం, పచ్చిరొట్ట పంటల సాగు, వ్యవసాయ డ్రోన్ లు, జీవన ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా పాడి పశువుల పోషణ, సమగ్ర వ్యవసాయ విధానం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ శాఖ నుండి అందిస్తున్న వివిధ సేవలు, వ్యవసాయ, అనుబంధ రంగాలలో మొబైల్ ఆప్ ల ప్రాముఖ్యత, వినియోగం మొదలైన అంశాల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతులు సాగుచేసిన పంటలను వివిధ పంట లను శాస్త్రవేత్త ,అధికారులు క్షేత్రాలు స్థాయిలో సందర్శించి పూల మొక్కల నర్సరీలో కృత్రిమ లైటింగ్, ప్లాస్టిక్ మల్చింగ్ మొదలైన సాంకేతిక అంశాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త డా. ఎం. మంజునాథ్, పెనుమూరు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు, కే.వి.కే విస్తరణ శాస్త్రవేత్త రాము కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, డిల్లీ బాబు, ధనశేఖర్, అభ్యుదయ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**నగరి, మేజర్‌న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం ఆశా వర్కర్స్ యూనియన్ చిత్తూరు జిల్లా ఏఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆశలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సదస్సు డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మాట్లాడుతూ ఆశాలకు వేతనాలు పెంచి ఉద్యోగ గుర్తింపు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది . మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు గ్రాజువిటీ కింద 1 లక్ష, 50,000, 60 సంవత్సరాలు నుండి 62 సంవత్సరాల వయోపరిమించిన పెంచుతూ మెటర్నటీ లీవుల కింద 180 రోజులు ఇస్తామని ప్రకటించడం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య,ఆశ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మరి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత జిల్లా నాయకులు ఉషా రాణి, హంస, షీబా, దివ్య భారతి ,గౌరీ, భువన, బ్యూల, రాజేశ్వరి లక్ష్మీ నీరజ, ఏఐటీయూసీ నాయకులు రాజేంద్ర సతీష్ సురేష్ యేసయ్య ముత్తు మరియు ఆశలు పాల్గొన్నారు.

# నైనేరమ్మ అయాలయంలో ఘనంగా 14వ వార్షికోత్సవం

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని డీ ఎం పురం పంచాయతీ డేరా కండ్రిగ గ్రామం సమీపంలో నేనేరమ్మ గుంట వద్ద వెలసిన నైనేరమ్మ ఆలయంలో 14వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో డేరాకండిగ, పాత డేరా కండ్రిగ, నాయుడు ఇండ్లు, గ్రామాలకు చెందిన అమ్మవారికి పొంగలి పెట్టి నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు అందరూ కలిసి దాదాపు వెయ్యి మంది పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆముదాల సుగుణ తిరుపతి చిన్నప్ప, గుత్తి బొబ్బిలి, ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నేనేరామ్మ తల్లికి కోర్కెలు తీర్చే అమ్మగా ఆనందుడు పేర్కొన్నారు. ఆలయం చుట్టూ విద్యుద్దీపన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రకాష్, వెంకటేష్, గోపాల్, వెంకటేష్, ముని సుందరం భీమయ్య ,మురళి, గోపి తదితరులు పాల్గొన్నారు.





## ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విజయభేరి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ రెండు విభాగాలలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఇందులో ఓ.అరుష్ లక్ష్మణ్ 45వ ర్యాంకు, వి.యశ్వంత్ 135,డి.లావణ్య 230,లక్ష్మీ సహస్ర 322, ఏ.జశ్విత 398,కె.జశ్విత 444,వై.శివకృతి 492 హర్షవర్ధన్ 528,ఎమ్.ఉమేష్551,ఎం. హిమవర్ష 787, సి.రామలక్ష్మమ్మ 799, వి.లక్ష్మి హర్షిత 800,కె.మంజునాథ మహర్షి 900 కే.తీన్నారని 919,వి. సాధన 925 వంటి వెయ్యిలోపు టాప్ ర్యాంకులు సాధించడంతో పాటు,167 మంది విద్యార్థులు 5 వేల లోపు ర్యాంకులు,348 మంది విద్యార్థులు 10 వేల లోపు ర్యాంకులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు.ఇంతటి అద్భుత విజయాలకు కారణం.. అధ్యాపకుల సమిష్టి కృషితో పాటు ఉత్తమ ఆబ్జెక్టివ్ మెటీరియల్స్ అలాగే విద్యార్థుల అకుంఠిత దీక్షలే కారణం అని డైరెక్టర్లు సుష్మ శ్రీ, నాగేంద్రలు తెలిపారు.అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను,అదేవిధంగా అధ్యాపకులను శ్రీ చైతన్య తిరుపతి శాఖ ఏజీఎం బీవీ.ప్రసాద్, డీన్‌లు కేఎల్ జి. ప్రసాద్, రామ్మోహన్‌రావు, శ్రీనివాసరాజు,భాస్కర్ లతోపాటు ప్రిన్సిపాళ్ళు అభినందించారు.

## నేడు పెద్దపంజాణిలో యోగాంధ్ర ర్యాలీ

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** యోగాంధ్ర కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన, చైతన్యం కలిగించి జూన్ 21వ తేదీ యోగ దినోత్సవం విజయవంతం చేయటానికి నేడు అన్ని సచివాలయాల పరిధిలో ర్యాలీలు నిర్వహించాలని జిల్లా అధికారుల ఆదేశం మేరకు పెద్దపంజాణి మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు ప్రజలు ఉద్యోగస్తులు హాజరుకావాలని పెద్దపంజాణి యోగాంధ్ర మండల కమిటీ వారు ఆహ్వానించారు. మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు నేటి ఉదయం 11 గంటలకు పెద్దపంజాణి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి నిర్వహించే ర్యాలీకి హాజరు కావాలన్నారు.

## కత్తెరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ముగ్గురు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



**కార్వేటి నగరం మేజర్‌న్యూస్:** మండలంలోని కత్తిర పల్లి పంచాయతీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన పదో తరగతి విద్యార్థులకు ముగ్గురు ప్రతిభా అవార్డులు వచ్చినట్లు ప్రధాన ఉపాధ్యాయులు చెంగల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2025 పదవతరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సంవత్సరం "షైనింగ్ స్టార్" పేరుతో ప్రతిభా పురస్కారాలు అందిస్తోంది. ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో 576 మార్కులు సాధించిన ప్రశాంత్, 546 మార్కులు సాధించిన చిన్ని, 518 మార్కులు సాధించిన ద్యానిలు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు రేపు చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో జిల్లా మంత్రి మరియు జిల్లా కలెక్టర్ చేతులమీదుగా రూ 20వేల నగదు బహుమతి, మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్లు అందుకోనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులలో ఒకరు పాల్గొంటారు. ఈ సందర్భంగా మండలంలోని అత్యధికంగా ముగ్గురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు గ్రామస్తులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

## ఈతకు వెళ్లి యువకుడి మృతి



**బంగారుపాళ్యం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని స్థానిక మండల ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న బావిలోనికి ఈతకు వెళ్లిన వ్యక్తులు ఎం. మురళి వయస్సు 23 సంవత్సరాలు (తండ్రి) వెంకటరమణ ఇతను కోలార్ జిల్లా ముల్ బాగుల్ తాలూకా చాపరపల్లి గ్రామం ఇతను తన స్నేహితులతో పాటు, అజయ్, విశ్వనాథ్, విజయ్, రాజశేఖర్, గణేష్, వీరందరూ కలిసి ఈతకు వెళ్లడంతో మురళి ప్రమాదవశాత్తు బావిలో లోతుకు వెళ్లి మునిగిపోయి చనిపోవడం జరిగింది. ఈ విషయానికి సంబంధించి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు సిఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

## ముగ్గురు పేకాటరాయళ్ల అరెస్ట్



పెళ్లకూరు మేజర్‌న్యూస్: మండలంలోని నందిమాల పంచాయతీ పరిధిలోని ఎర్రగుంట గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు పేకాట రాయుళ్ళను స్థానిక ఎస్సై కె నాగరాజు దాడి చేసి అరెస్ట్ చేశారు.ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను, 3 సెల్ ఫోన్‌లు, రూ.3100 నగదును, 4 బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

## తిరుమల మొదటి ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

**- డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు**



**తిరుమల, మేజర్‌న్యూస్:** మొదటి ఘాట్ రోడ్డు 4వ మలుపు సమీపంలో డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు. కంట్రోల్ కాకపోవడంతో వేగంగా డివైడర్‌ని ఢీ కొట్టిన కారు. స్వల్ప గాయాలతో బయటపడ్డ భక్తులు. వీరు తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన వారిగా గుర్తింపు.

# పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి

## రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వి. గురు రాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి



**పలమనేరు, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో ఉన్న నాలుగు లక్షల మంది పెన్షనర్లకు గత 5సంవత్సరాలుగా పింఛన్లు ఉన్న 8విడతల కరువు భృతి (డి ఆర్ ) బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వి. గురు రాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక పలమనేరు నార్త్ పాఠశాలలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అసోసియేట్ అధ్యక్షులు వి. గురు రాజారావు మాట్లాడుతూ.... గత ప్రభుత్వం జూలై 2018 నుండి జూలై 2023 మధ్య చెల్లించాల్సిన 8 విడతల డి ఆర్ బకాయిలు ఏప్రిల్ 2020 నుండి డిసెంబర్ 2021 వరకు చెల్లించాల్సిన పిఆర్సి బకాయిలు మొత్తం తొమ్మిది కోట్ల రూపాయలు చెల్లించవలసి యున్నది. పై తెలిపిన బకాయిలు తీసుకో కుండానే గత 5 సంవత్సరాలుగా వేలాది పెన్షనర్లు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం చనిపోయిన పెన్షనర్ల కుటుంబాలకు ఈనాటికీ బకాయిలు చెల్లించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో రావడానికి ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్ల కృషి మద్దతు గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా అభినందనలు తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల వాగ్దానాల సభలో తెలిపిన తెలియజేసినట్లుగా బకాయిలను వెంటనే విడుదల చేసి ఆర్థికంగా పెన్షనర్ల కుటుంబాలన్నీ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ హెచ్ ఎస్ పథకాన్ని 10 లక్షల మంది ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు ప్రతి ఒక్కరూ నెలకు రూ 225 రూపాయలు రూ 300 రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తున్నామన్నారు. మెడికల్ క్లెయిమ్ రూ: రెండు లక్షలు నుండి రూ 5 లక్షల రూపాయలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గౌస్, కృష్ణమూర్తి, ఆర్ముగం, మోహన్, గౌడు, మస్తాన్, సుబ్రహ్మణ్యం, మాలతి, నాగభూషణం, రెడ్డమ్మ, చంద్రశేఖర్, జగదీష్, అక్బర్ బాషా, సుబ్రహ్మణ్యం రెడ్డి, పురుషోత్తం, భద్రమ్మ, గోవిందయ్య, గురు స్వామి నాయుడు, గుణశేఖర్, మధు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి మహిళలను కించపరిచిన సాక్షి ఛానల్ ఎండి భారతిని అరెస్ట్ చేయాలి

**-రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ళ హేమాద్రి నాయుడు**



**గుడిపాల, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని, అమరావతి మహిళలను వేశ్యల రాజధాని అని కించపరుస్తూ సాక్షి ఛానల్ లో కొమ్మినేని శ్రీనివాసరావు డిబేట్లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ వ్యాఖ్యానించడాని మరియు అభ్యంతరకరమైన వ్యాఖ్యలను ప్రసారం చేసిన ఎండి భారతి ఎస్సీ ఎస్టీ చట్టం కింద వెంటనే అరెస్టు చేసి మహిళలకు గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నమ్మి 35 వేల ఎకరాలు భూమిని రాజధానికి ఇచ్చిన గొప్ప త్యాగమూర్తులు రాజధాని రైతు కుటుంబాలు అని కొనియాడారు అటువంటివారినే సాక్షి ఛానల్ లో వేశ్యలు అని అందర్నీ కలిపి మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనమని అమరావతి రాజధాని అభివృద్ధి చెందుతుంటే ఓర్చుకోలేక మొదటి నుండి వైఎస్ఆర్సిపి వాళ్లు విషం చిమ్ముతున్నారని ఏదో ఒక విధంగా రాజధానిని అభివృద్ధి అడ్డుకునే శాంతి భద్రతల సమస్య సృష్టించి ఆగిపోయేలా చేయాలని వైఎస్ఆర్సిపి ఎత్తులు వేస్తున్నదని గతంలో భారతీ రెడ్డి ఒక మాట ఎక్కువ అన్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి తెలుగుదేశం కార్యకర్త అని కూడా చూడకుండా చేబ్రోలు కిరణ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి జైల్లో పెట్టాడని ఈ రోజు ఇంత మంది మహిళలను కించపరిస్తే ఇంతవరకు అరెస్టు చేయకుండా ఉండడం దురదృష్టకరమని వెంటనే చర్యలు తీసుకొని వారి మీద కేసులు పెట్టి అరెస్టు చేయకపోతే తెలుగుదేశం కార్యకర్తలు రోడ్లమీద ఎక్కుతారని తెలిపారు.

## మహిళలను కించపరిన వారిని వెంటనే శిక్షించండి



**నగరి మేజర్‌న్యూస్ :** నగరి మున్సిపాలిటీ పరిధిలోగల తెలుగుదేశం పార్టీ నాయకులు మహిళా నాయకురాలు అందరూ కలిసి నగరి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వారికి పోలీస్ స్టేషన్ నందు అమరావతిలో మహిళలపై కించపరిచి మాట్లాడటం హేయమైన చర్యని ఇందుపై ఖండిస్తూ వారిని అరెస్ట్ చేయాలని పట్టణ తెలుగుదేశం పార్టీ తరపున వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శిష్టా సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజ



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మేజర్ పంచాయతీ నగరం చెరువు వద్ద వెలిసిన శిష్ట సౌందర్య వల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆలయంలో అభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద నందీశ్వరునికి ప్రదోష పూజ వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కోదండపాణి మొదలియార్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, ముఖ్య కార్య కార్య నిర్వహణ అధికారి బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు ప్రసాద్ రాజు ప్రసాద్ యాదవ్, ప్రసాద్ రెడ్డి, సహాయ కార్యదర్శి సుబ్బరాయుడు యాదవ్, కృష్ణ స్వామి రాజు, సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పనపాకంలో శుభకార్యాయానికి హాజరైన మోహిత్‌రెడ్డి



**చంద్రగిరి, మేజర్ న్యూస్:** మండలంలోని, పనపాకం పంచాయతీ (హెచ్ డబ్ల్యూ)చెందిన వైఎ స్సార్ సిపి కుటుంబ సభ్యులు సంగాపు రాజేష్ కొత్తగా ఇంటి నిర్మాణం చేయడంతో ఆదివారం వారి గృహప్రవేశంకు చంద్ర గిరి వైఎస్సార్ సిపి ఇన్‌చార్జ్, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహప్రవేశం చేసిన ఆదంపతులకు జ్ఞాపికను అందజేసి అంతా మంచి జరగాలని, కొత్త ఇంటిలో కలసి రావాలని ఆకాక్షిం చారు. మోహిత్ రెడ్డి పనపాకం చేరుకోగానే పంచాయతీ పార్టీ అధ్య క్షులు, వైస్ యంపిపి బొజ్జా వెంకటరత్నం,స్థానిక నేతలు, మాతయ్య, అమాస నాగేశ్వరరావు, అజయ్ కుమార్, సుదర్శన్, ప్రసాద్,లు మోహిత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రజలను, యువకులను పేరు పేరు పలకరించి యోగ క్షేమాలను తెలుసు కొన్నారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెంట చంద్రగిరి మండల వైఎస్సార్ సిపి అధ్యక్షులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి,స్థానిక నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో కార్మికునికి గాయాలు



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని మంగళం పంచాయతీ కంగా నెల్లూరు గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువ పనులు చేస్తున్న తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా రేవల్లి గ్రామానికి చెందిన కురమయ్య కుమారుడు మధు (23) ఆదివారం స్నానం కోసం వేడి నీళ్లు కాచుతుండగా అగ్ని ప్రమాదానికి గురి అయ్యాడు. వెంటనే గమనించిన స్థానికులు హుటాహుటిన పుంగునూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# కుప్పంలో కల్తీ విశ్వరూపం..!

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్లు, టిఫిన్ సెంటర్లలో తినేందుకు మక్కువ చూపుతుండడంతో ఇదే అదునుగా కొందరు వ్యాపారులు టేస్ట్‌గా చేస్తే చాలు.. వాడే వస్తువులు ఏవైతే నేం? అనే ధోరణితో కల్తీ వస్తువులను వాడుతున్నారు. చిన్నచిన్న హెూటళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తు న్నాయి. దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు,బిర్యానీ పాయింట్లు,తోపుడు బండ్లపై తినుబండారాలు, మిక్చర్ పాయింట్లు తదితర చోట్ల కల్తీ వస్తువులతో ఆహార పదార్థాలు తయారు చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.



ప్రధానంగా దాబా హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నాసిరకం/కల్తీ వస్తువులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన అధికారులు తనిఖీలు చేయడం లేదు. తనిఖీలు చేసినా తీసుకునే చర్యలు శూన్యమే!

### వాడిన నూనెలే మళ్లీ వాడకం

హెూటళ్లు మొదలు స్ట్రీట్‌ఫుడ్ తయారీదారుల వరకూ ఒకసారి వాడిన నూనెను తిరిగి వాడకూడదనే నిబంధనలున్నా రోజుల తరబడి ఇంకిపోయేదాకా అవే నూనెలు వాడుతున్నారు. అడుగున మడ్డి కట్టిన నూనెలోనే వేయించడం, కూరలు, చెట్నీ, సాంబార్లకు వాడుతున్నారు. పాల ఉత్పత్తులు, బ్రెడ్ వంటి వస్తువులు వారం రోజులు కూడా నిల్వ ఉండవు. తయారైన రోజు నుంచి వారంలోపే వాడేయాలి. అలాంటిది కొన్ని నాన్ బ్రాండెడ్ వస్తువులపై తయారీ తేదీ వేయకుండానే విక్రయిస్తున్నారు. బేకరీల్లో పఫ్‌లు, బిస్కెట్లు,స్వీట్లు నాణ్యతలేనివి అమ్ముతున్నారు.

### బ్రాండెడ్ పేర్లతో నకిలీ వస్తువుల తయారీ

బ్రాండెడ్ పేర్లతో కల్తీ/నకిలీ వస్తువులను తయారీ చేసి అమ్ముతున్నారు. కొద్దితేడాను పాటిస్తూ బ్రాండ్ల పేర్లను పోలి ఉండేలా ఒక అక్షరాన్ని చేర్చి మార్కెట్లో విక్రయిస్తున్నారు. రద్దీ ప్రాంతాలైన బస్టాండ్‌లు, మారుమూల ప్రాంతాల్లో వీటిని విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ ఆహార పదార్థాల తయారీపైనా కల్తీ నియంత్రణ అధికారులు దృష్టిపెట్టాల్సి ఉంది. వంటనూనె, బిస్కెట్లు, మినరల్ వాటర్ బాటిళ్లు, చిప్స్, కుర్కురే లాంటి వస్తువుల నకిలీలను బ్రాండెడ్ ప్యాక్ పోలి ఉండేలా డిజైన్ చేస్తూ ప్రజలను మోసగిస్తున్నారు. నాసిరకం తినుబండారాలతో పిల్లల అనారోగ్యానికి గురవుతున్నారు. నకిలీ వస్తువుల అమ్మకాల్లో దుకాణదారులకు మార్జిన్ ఎక్కువ ఉండటంతో వాటినే అంటగడుతు న్నారు. లాభమే లక్ష్యంగా ప్రజారోగ్యాన్ని పాడుచేస్తున్నారు.

### ఆహార భద్రత అధికారుల పర్యవేక్షణ కరువు

కుప్పం నియోజకవర్గంలో కల్తీ ఆహారం రాజ్యమేలుతోంది. నిల్వ ఉంచిన ఆహారాలను విక్రయిస్తూ ప్రజారోగ్యంపై దెబ్బ తీస్తున్న విక్రయదారులపై అధికారులు చర్యలు శూన్యం అనిపిస్తుంది. కల్తీ ఆహారాలు విక్రయం జరగకుండా తీసుకోవాల్సిన అధికారులే ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుంటే కల్తీ రాకెట్లు రెచ్చిపోతున్నారు.ఆహార భద్రత అధికారులు ఒక్కొక్కరు వారి పరిధిలో నిర్ణీత సంఖ్యలో ప్రజలు ఉపయోగించే నిత్యవసరాల్లో వాటి నాణ్యత ప్రమాణాలను తెలుసుకునేందుకు నమూనాలను సేకరించాలి. సేకరించిన నమూనాలను ల్యాబ్‌లకు పంపించి వచ్చిన ఫలితాలు ఆధారంగా విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి. అయితే ఈ తీరు ఆచరణలో మాత్రం శూన్యం అనిపిస్తుంది. పర్యవేక్షించాల్సిన అధికారులే పట్టించుకోకుండా ఉంటూ తూతూమంత్రపు దాడులతో మమ అనిపిస్తున్నారు.ప్రతి మండలానికి ఒక ఆహార భద్రత అధికారి ఉండి పర్యవేక్షణ చేయాల్సి ఉండగా.. కుప్పం నియోజకవర్గంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు ప్రజల నుండి వస్తున్నాయి.వెంటనే జిల్లా కలెక్టర్, కడ పీడీ చొరవ తీసుకొని ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కుప్పం నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.





## వైసీపీ నాయకులు మాట్లాడిన తీరును ఖండించిన మధుసూదన్ రాయల్

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** టీడీపీ నాయకులు మధుసూదన్ రాయల్ తన నివాసంలో ఆది వారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత విధ్వంస పాలనకు విముక్తి పలికి సంవత్స రం రోజులు అయింది రాజధానికి స్వచ్ఛందం గా రైతులు భూమిఇచ్చారు. కొంతమంది వైసిపి నాయకులు అమరావతిని వేశ్య రాజధానిగా హేళనచేయడం చాలా బాధాకరమన్నారు. భారతదేశంలోని ఒక మహెూన్నతమైన రాజ ధానిగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమరావతి వేదికగా చెప్పాడు. మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అండదండలతో రాజధానిప్రాంతాన్ని మహెూన్నతమైన రాజధానిగా చేస్తారు ఇప్పుడు రాజధానికి భూములు ఇచ్చిన మహిళలను ఇలా కించపరచడం చాలా బాధాకరమన్నారు.

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

## సూర్యప్రభ వాహనంపై గోవిందరాజస్వామి కటాక్షం



(మొదటిపేజీ తరువాయి)

దర్శించుకున్నారు. సూర్యుడు తేజోనిధి, సకలరోగ నివారకుడు, ప్రకృతికి చైతన్యప్రధాత. వర్షాలు, వాటివల్ల పెరిగే సస్యాలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే ఓషధులు మొదలైనవన్నీ సూర్య తేజం వల్లనే వెలుగొందుతు న్నాయి. అట్టి సూర్యప్రభను అధిష్టించి స్వామి ఊరేగడం ఆనందదాయకం. అనంతరం ఉదయం 10 నుండి 11 గంటల వరకు సతీసమేతంగా గోవిందరాజస్వామి వారికి స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, చందనంతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వాహన సేవలో పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఆలయ డెప్యూటి ఈఓ శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







## హంస వాహనంపై సరస్వతీ అలంకారంలో విహరించిన ప్రసన్న వేంకటేశ్వరుడు

అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి సరస్వతి అలంకారంలో స్వామివారు హంస వాహనంపై భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభమైంది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. వాహన సేవలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెం డెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్యలో చిత్తూరు జిల్లాలోని కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.
కుప్పం నియోజకవర్గం :
1. గుడిపల్లి, 2.రామకుప్పం.
పలమనేరు నియోజకవర్గం :
1.గంగవరం, 2.బైరెడ్డిపల్లి
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116